క్లుప్తంగా

పక్కాగా గ్రామాల్లో సామాజిక తనిఖీ



ప్రత్తిపాడు: గ్రామాల్లో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలను పక్కాగా నిర్వహించనున్నట్లు సోషల్ ఆడిట్ టీం ఎస్సార్పీ ఆవులయ్య అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సోషల్ ఆడిట్ బృందం అనుబంధ శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ గ్రామాలకు డీఆర్పీలు వచ్చినప్పుడు ఆయా శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఉపాధి ద్వారా చేపట్టిన పనులు పరిశీలించే సమయంలో డీఆర్పీలు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో ఏడుకొండలు, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ ఆదం షఫీ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



గుంటూరు రూరల్: ప్రతి పౌరుడు ఇంటిపై సగర్వంగా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటాలని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా బుధవారం చౌడవరంలోని కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి, దేశభక్తి నినాదాలు చేస్తూ తిరంగా ర్యాలీని నిర్వహించారు. కళాశాల ఆవరణ నుంచి పరిసర ప్రాంతాల మీదుగా సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత దేశ జాతీయ జెండా స్వేచ్ఛ, సార్వభౌమత్వం, ఐక్యత, పురోగతి, త్యాగాలకు సూచిక అని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని వర్ణించడానికి జాతీయ జెండా ఒక అద్భుత సందేశాత్మక చిహ్నమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, ఎన్‌సీసీ ఆఫీసర్స్, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్స్, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

శివాలయంలో పూజారి దందాపై ఈవోకు ఫిర్యాదు

పెదకాకాని: శివాలయంలో పూజారి దందాపై ఈవోకు భక్తులు ఫిర్యాదు చేశారు. బాబు అన్నప్రాశనకు రూ.5,116తో పాటు బట్టలు పెట్టాల్సిందేనని పట్టుబట్టాడు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బాబు అన్నప్రాశన జరిపించేందుకు మంగళవారం నంబూరు గ్రామానికి చెందిన ఉయ్యూరు వెంకటరెడ్డి దంపతులు వచ్చారు. కార్యక్రమం పూర్తయిన తరువాత అర్చకుని ఆశీర్వాదం తీసుకునేందుకు రూ.1116ను ఇవ్వడంతో నిరాకరించాడు. తరువాత మరో రూ. 200 కలిపి ఇచ్చినా కాదని చెప్పడంతో రూ. 1516 ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని అర్చకుడు రూ. 5116 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టాడు. బాబు తాతయ్య ఉయ్యూరు వెంకటరెడ్డి మరో తాంబూలంలో రూ. 200 పెట్టి ఇస్తుండగా రూ. 516 అయితేనే తీసుకుంటా.. తగ్గితే తీసుకోనని తేల్చి చెప్పాడు. తన పేరు అడగ్గా జాలయ్య అని.. అయితే ఏంటి ? అంటూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించాడు. దీంతో ఆవేదన చెందిన ఉయ్యూరు వెంకటరెడ్డి ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్‌కు ఫిర్యాదు చేశారు.



నిడుబ్రోలులో చెరువును తలపిస్తున్న వరి పొలం



పొన్నూరు ఆర్టీసీ డిపోలో నిలిచిన నీరు



పొంగి పొర్లుతున్న గుంటూరు చానల్

భారీ వర్షం.. స్తంభించిన జన జీవనం

- ఎడతెరిపి లేకుండా కుండపోత వాన
- రహదారులు జలమయం
- పేదల గుడిసెల్లోకి చేరిన నీరు
- చెరువులుగా మారిన పంట పొలాలు..
- జలదిగ్బంధంలో మూడు గ్రామాలు
- గుంటూరు చానల్‌కు గండి
- చేబ్రోలులో 234.6 మి.మీ. వర్షపాతం నమోదు



కసుకర్రులో నీట మునిగిన వరి

పొన్నూరు: గత రాత్రి కురిసిన భారీ వర్షంతో పొన్నూరులో జన జీవనం స్తంభించింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమై 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురియడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. సాయంత్రం ఆరు గంటలకు మొదలైన వాన బుధవారం వరకు జల్లులతో కొనసాగింది. డీవీసీ కాలనీ, ఏడో వార్డు, పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు నిలిచి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారుల్లో రెండు అడుగుల లోతులో నీరు నిలవడంతో, వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సైడు కాలువలు పొంగి పొర్లాయి. ప్రధాన కూడళ్లలో, డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించి పరిస్థితి చక్కదిద్దేందుకు పారిశుధ్య సిబ్బంది శ్రమించినా ఫలితం లేకపోయింది. మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం తగిన కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. మండల పరిధిలోని పలు విద్యాలయాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. సుమారు 28 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు వరి సాగు చేస్తున్నారు. సగానికి పైగా పంట పొలాలు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. వెద పెట్టిన ప్రారంభ దశలో భారీ వర్షం కురవడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు పూర్తిగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. ఇకపై వర్షాలు కురిస్తే సాగుపై ఆశలు వదులుకోవాల్సిందేనని, మళ్లీ వెద పెట్టడం సాధ్యమయ్యే పని కాదని చెబుతున్నారు.

అటు నీళ్లు.. ఇటు కన్నీళ్లు

పెదకాకాని: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, పంట పొలాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. నివాసితులు సామానులు సర్దుకుని పిల్లాపాపలతో బంధువుల ఇళ్లలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని నంబూరు, గోళ్లమూడి రహదారుల్లో ఉన్న చప్టాల పైకి నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నంబూరు నాలుగు వైపులా ఉన్న రోడ్ల పైకి నీరు చేరింది. అత్యవసర అవసరాలకు గ్రామం నుంచి బయటకు వెళ్లే వారు కాలువ కట్టపై ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కుబడిగా నంబూరు గ్రామానికి ట్రాక్టర్‌పై చేరుకున్న రెవెన్యూ అధికారులు, పూర్తిగా పరిశీలించకుండానే వెనుతిరిగారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గోళ్లమూడి గ్రామానికి వెళ్లే పెదకాకాని, ఉప్పలపాడు, నంబూరు రోడ్లపై వర్షపునీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెనిగండ్ల చెంచుకాలనీలో గుడిసెలను వర్షపు నీరు చుట్టుముట్టింది. వెనిగండ్ల జొన్నలగడ్డ రోడ్డులో మెట్ట పైర్లు నీట మునిగాయి. రోడ్డుపై కూడా వరద నీరు ప్రవహిస్తోంది. మండలంలో 186.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని నంబూరు, గోళ్లమూడి, పెదకాకాని, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, తంగెళ్లమూడి, దేవరాయబొట్లవారిపాలెం శివారులో పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగి, చెరువులుగా మారాయి. గుంటూరు చానల్(కొత్తకాలువ)కు గండి పడటంతో నీరు పొలాల్లోకి చేరుతోంది.

ప్రత్తిపాడు: వాన దెబ్బకు రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురిసిన వర్షంతో పంట పొలాలు నీట మునిగాయి. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో నాలుగు వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. వరి, పత్తి పొలాలు సముద్రాలను తలపిస్తున్నాయి. ప్రత్తిపాడుతో పాటు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలోని పత్తి పొలాలు నీట నానుతున్నాయి. ప్రత్తిపాడు మండలంలో 65.4 మి.మీ, కాకుమాను మండలంలో 60.4 మి.మీ, వట్టిచెరుకూరు మండలంలో 89.6 మి.మీ, పెదనందిపాడు మండలంలో 62.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

భారీ వర్షంతో నీట మునిగిన పంట పొలాలు

చేబ్రోలు: బంగాళాఖాతంలోకి ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి చేబ్రోలు మండలంలో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంతో పాటు పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వరి పొలాలు నీటి మునిగి, సముద్రాన్ని తలపిస్తున్నాయి. కాలువలు, చెరువులు పొంగి ప్రవహించడంతో మాగాణి, మెట్ట, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి.

శ్రీరంగపురంలో ఆలయ శిఖరంపై పిడుగు

మండల పరిధిలోని శ్రీరంగపురంలోని శ్రీమోహనరంగనాథ స్వామి దేవస్థానం ఆలయ శిఖరంపై మంగళవారం రాత్రి పిడుగు పడింది. కల్యాణోత్సవానికి ఉపయోగించే మండపం ఆలయ గోపరం, శిఖరం పూర్తిగా దెబ్బతింది. శిఖరంపై పిడుగు పడి దెబ్బతినడంతో గ్రామస్తులు, భక్తులు ఆవేదన చెందుతున్నారు.

శలపాడులో ఆలయంలోకి ప్రవేశించిన వర్షపునీరు

మండల పరిధిలోని శలపాడులో గల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోకి వర్షపు నీరు ప్రవేశించి, చెరువును తలపించింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆలయ ప్రాంగణం, పరిసరాలు నీటితో నిండిపోయాయి. మండల పరిధిలోని వీరనాయకునిపాలెంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీర్ఘకాలంగా పంచాయతీ కార్యాలయ ప్రాంగణ పరిసరాలు మునిగిపోతున్నాయి. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో సమస్య తరచూ తలెత్తుతోంది.

చేబ్రోలులో భారీ వర్షపాతం నమోదు

గతంలో ఎన్నడూ లేని విధంగా చేబ్రోలు మండలంలో ఒక్క రాత్రిలోని 234.6 మి.మీ. భారీ వర్షపాతం నమోదైంది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలు నీట మునిగిపోయాయి.

కూలిన పూరిల్లు

గొల్లపాలెం ప్రాంతానికి చెందిన గట్టుపల్లి సీతయ్యకు చెందిన పూరిల్లు ఒక వైపునకు కూలిపోయింది. ఈ సంఘటనలో ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పొంగుతున్న అప్పాపురం చానల్

చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల పరిధిలోని అప్పాపురం చానల్ భారీ వర్షానికి వరద నీరు చేరటంతో పొంగి ప్రవహించింది. పాతరెడ్డిపాలెం గ్రామ సమీపంలోని చానల్ నీరు దళితవాడ ప్రాంతంలోని ఇళ్లలోకి చేరింది. వడ్లమూడి సమీపంలోని కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. వట్టిచెరుకూరు మండల పరిధిలోని కోవెలమూడి గ్రామ పరిధిలోని పంట పొలాల్లో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

సముద్రాన్ని తలపిస్తున్న పంట పొలాలు

భారీ వర్షంతో చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు, వడ్లమూడి, శేకూరుపాలెం, సుద్దపల్లి, శలపాడు, గొడవర్రు, మంచాల తదితర గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగి సముద్రాన్ని తలపిస్తున్నాయి. మురుగు నీటి కాలువలు సక్రమంగా లేకపోవటంతో పొలాల్లోని వర్షపునీరు బయటకు పోయే మార్గం లేక దెబ్బతిన్నాయి. సుమారు 15వేల ఎకరాల్లోని వరి సాగు చేస్తున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేబ్రోలు, వడ్లమూడి, వీరనాయకునిపాలెం, సుద్దపల్లి, శేకూరు తదితర గ్రామాల పరిధిలో చానల్స్, డ్రెయిన్లు పొంగి ప్రవహించటంతో పొలాలు నీట మునిగిపోయాయి.

యానాది కాలనీని చుట్టు ముట్టిన వర్షపు నీరు

పెదకాకాని: భారీ వర్షాలకు స్థానిక యానాది కాలనీని వర్షం నీరు చుట్టుముట్టడంతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. కనీసం వంట చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. చిన్న పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సమాచారం అందుకున్న జేఎంజే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఆహార పదార్థాలతో అక్కడికి చేరుకుని కలి తీర్చారు. నీరు నిండిన గుడిసెల్లో అవస్థలు పడుతున్నామని, ఆహారం, నీరు సమకూర్చి ఆదుకోవాలని దాతలను వారు కోరుతున్నారు.



గుడిసెలోకి వర్షపు నీరు చేరడంతో బిడ్డతో బయట నుంచున్న తల్లి



నీటిమయమైన పొన్నూరు ఏడో వార్డు



జొన్నలగడ్డ పొలిమేరలో రోడ్డుపైకి చేరిన నీరు



వెనిగండ్ల శివారు జొన్నలగడ్డ రోడ్డులో నీట మునిగిన పత్తి పైరు



నంబూరులో చెరువులుగా మారిన వరి పొలాలు

వాగులు, వంకలు ఏకం



నల్లపాడు బ్యాంక్ బజారులో ఇళ్లలోకి నీరు



సత్తెనపల్లి, గుంటూరు ప్రధాన రహదారిపై హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

గుంటూరు రూరల్: అకాల వర్షంతో వాగులు, వంకలు ఏకమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రూరల్ మండలంలో పత్తి, వరి, అపరాల పంటలు పూర్తిగా నీట మునిగాయి. తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో వరద నీటితో పాటు డ్రైనేజ్‌లో నీరు కలిసి ప్రధాన రహదారులను ముంచెత్తుతున్నాయి. మండలంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ నుంచి నల్లపాడు వరకూ సత్తెనపల్లి, గుంటూరు ప్రధాన రహదారిపై సుమారు మూడు అడుగులపైగా నీరు చేరింది. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. నాలుగు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. వరద నీరు, డ్రైనేజీ నీరు కలిసి ప్రవహిస్తూ ఉండటంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వంగిపురంలో తటాకాలను తలపిస్తున్న పంట పొలాలు



ప్రత్తిపాడులో నీట నానుతున్న పత్తి మొక్కలు



రంగనాథస్వామి ఆలయ శిఖరంపై పిడుగు పడటంతో దెబ్బతిన్న గోపురం



వీరనాయకునిపాలెంలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



నారాకోడూరులో సముద్రాన్ని తలపిస్తున్న పంట పొలాలు

అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే ప్రజలకు శాపం

- గుంటూరు చానల్, నీట మునిగిన పొలాలను పరిశీలించిన
- పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



గుంటూరు చానల్ కాలువకట్ట, నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: కూటమి ప్రభుత్వ చేతివాటం అధికారుల బాధ్యతారాహిత్యం రైతులు, ప్రజల పాలిట శాపంగా మారిందని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గుంటూరు చానల్(కొత్తకాలువ)కు గండి పడటంతో పాటు పలు ప్రాంతాల్లో కాలువ కట్టలు పొంగి పొర్లుతున్నాయి. గుంటూరు ఛానల్‌ను, నీట మునిగిన పొలాలను, గండి పడిన మంచినీటి చెరువును పరిశీలించేందుకు బుధవారం అంబటి మురళీకృష్ణ వర్షంలోనే ఆయా ప్రాంతాలలో పర్యటించారు. స్థానిక రైతులు, నాయకులు ప్రజలతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత ఏడాది అధిక వర్షాలకు గుంటూరు చానల్‌కు గండ్లు పడి పంట పొలాల నీట మునగడంతో రైతులు నష్టపోయారన్నారు.

ఆ గండ్లను పటిష్టపరచడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఏడాది గుంటూరు చానల్‌లో పేరుకుపోయిన తూటికాడ గుర్రపు డెక్కను తూతూ మంత్రంగా తొలగించి 24 లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. కాలువ కట్లను బలోపేతం చేయడం మరిచారని, తూటికాడ పూర్తిగా తొలగించకపోవడం వలనే కాలువ పొడవునా తూములకు గండ్లు పడటం, పొంగి పొర్లడం జరిగిందన్నారు. పంట పొలాలు నీటిలో మునిగి చెరువులను తలపిస్తున్నా అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని ఈ ప్రాంతానికి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, దానబోయిన నాగేశ్వరరావు, గోళ్ళ జోసఫ్, సుంకర నర్సిరెడ్డి, పోతురాజు గోపి, ఆలపాటి రాఘవ, ఆర్దల గడ్డేశ్వరరావు, బండ్లమూడి భాను కిరణ్, కుక్కల రాంప్రసాద్, షేక్ అన్సారీ, కంతేటి దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటిలో విద్యార్థుల ఇక్కట్లు

- నిర్లక్ష్యంలో యూనివర్సిటీ అధికారులు
- 24 గంటల దాటినా పట్టించుకునే నాథుడు లేడు
- నామమాత్రపు సందర్శనలతో సరిపెడుతున్న వర్సిటీ అధికారులు
- విద్యార్థులకు అవస్థలు



ఏఎన్‌యూలోని వసతి గృహాల్లోకి చేరిన వర్షపు నీరు

పెదకాకాని(ఏఎన్‌యూ): వర్షపు నీరు గదుల్లోకి, పరిసరాల్లోకి రావడంతో వర్సిటీ బాలుర వసతి గృహాల విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి యూనివర్సిటీలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది.

బాలుర వసతి గృహాల్లోకి భారీగా వచ్చి చేరింది. దీంతో గౌతమి, అశోకా వసతి గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్ గదులు నీట మునిగాయి. విద్యార్థుల వస్తువులు, పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో మొదటి అంతస్తులో ఉంటున్న విద్యార్థులు తోటి విద్యార్థుల గదుల్లో, శాతవాహన, అమరావతి వసతి గృహాల్లో తలదాచుకుంటున్నారు. గదుల్లో కరెంటు వైర్లు ఊడి నీళ్లలో పడటంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. మొదటి, రెండవ అంతస్తుల్లో ఉండే విద్యార్థులు, భోజనానికి ఇతర అత్యవసర అవసరాలకు బయటకు వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేయగా అధికారులు నామమాత్రపు చర్యలు చేపట్టారు. ఒకటి రెండు ప్రాంతాల్లో నిచ్చెనలు ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యార్థులను పైకి, కిందకు తిప్పుతున్నారు.

పట్టించుకోని అధికారులు

మంగళవారం రాత్రే వసతి గృ హాల్లోకి వర్షపునీరు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల చీఫ్ వార్డెన్ విదేశీ పర్యటనలో ఉన్నాడని సాకులు చెబుతూ, తమ సమస్యలు పట్టించుకునే వారే లేరని విద్యార్థులు వాపోయారు. ఇంజనీరింగ్ శాఖలో ఒక విభాగం వారు మరొక విభాగం వారిపై విమర్శలు చేసుకోవడం తప్పా బుధవారం రాత్రి వరకూ నీటిని తోడేందుకు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు లబోదిబో మంటున్నారు. వసతి గృహాల సంరక్షణకు కొద్దిరోజుల కిందట వర్సిటీ అధికారులు నిర్మించిన ప్రహరీ గోడ ఈ వర్షపు నీటికి నేల కూలడం కొసమెరుపు.